- స్వరాష్ట్రంలో నిరంతరాయంగా నాణ్యమైన కరెంటు
- ఐదున్నరేండ్లుగా సేద్యానికి త్రీఫేజ్ పవర్ సరఫరా
- ఉమ్మడి జిల్లాలో 1.43 లక్షల వ్యవసాయ కనెక్షన్లు

# ఉచిత విద్యుత్ స్వర్ణయుగం

మంచిర్యాల, నవంబర్ 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఏ అర్ధ రాత్రో.. అప రాత్రో.. దొంగోనోలే వచ్చే కరెంట్ కోసం పొలాల దగ్గర పడిగాపులు. కరెంట్ వచ్చే టైమ్ తెలుసుకొని అర్ధ రాత్రి మోటర్ పెట్టేందుకు పోతే.. కాళ్లకు కరెంట్ తీగలు తగిలో.. పాముల, తేళ్లు కరిచో రైతుల ప్రాణాలు పోయేవి. ఇది 50 ఏండ్లు మన రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పాలనలో దుస్థితి. తెలంగాణ వచ్చిన వెంటనే సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిండు. పదేళ్ల పాలనలో కరెంట్ షాక్‌లు కొట్టి రైతులు చనిపోయిన దాఖలాలు, కరెంట్ కోసం పొలాల కాడ పడిగాపులు కాయాల్సిన అక్కర లేకుండా పోయింది. రైతుకు ఎప్పుడు కుదిరితే అప్పుడే మోటర్ వేసుకుంటే పొలాలకు నీళ్లు పారుతున్నయ్. గింత మంచి విద్యుత్ సరఫరాను ఆపేసి, మూడు గంటలు కరెంట్ ఇస్తే సరిపోతదని కాంగ్రెస్ లీడర్ రాహుల్ గాంధీ, టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి మాట్లాడడంపై రైతులు మండిపడుతున్నారు. ఎప్పుడన్న ఎవుసం చేసినోళ్లయితే ఎన్ని గంటల కరెంట్ ఇవ్వాలనేది తెలిసేదని.. రైతుల కష్టం తెలియకుండా మూడు గంటల కరెంట్ సాలుతదని చెప్పినోళ్లు రేపు పొరపాటునో, గ్రహపాటునో గెలిస్తే పాత రోజులు మళ్లొస్తయని భయపడిపోతున్నరు. ఉచిత విద్యుత్ ఇచ్చిన కేసీఆరే రానున్న రోజుల్లో దాన్ని కొనసాగిస్తారని.. ముచ్చటగా మూడోసారి ఆయన్నే గెలిపించుకుంటామని చెప్తున్నరు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,43,217 ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. ఆసిఫాబాద్‌లో 6,800.., మంచిర్యాలలో 45,793.., నిర్మల్‌లో 72వేలు.., ఆదిలాబాద్‌లో 18,624 కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా లక్షలాది మంది రైతుల పొలాలకు నీళ్లు పారుతున్నయ్. కరెంట్ బిల్లులు కట్టే అవసరం లేకుండా, మోటార్లు కాలిపోయే దుస్థితి లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతున్నది. ఈ నేపథ్యంలో 24 గంటల ఉచిత విద్యుత్‌పై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం..

**కరెంటు కోసం 13 ఏండ్లు గోసవడ్డం..**
**- దూపం కుమార్ యాదవ్**

**కరెంటు.. త్రీఫేజ్.. ఐదేండ్లు.. 24 గంటలు..**



నా పేరు దూపం కుమార్. మాకు నెన్నెలలో ఐదెకరాల భూమి ఉంది. 13 ఏండ్ల కిందట వరి పండిద్దామని చేనును చదును చేసి పొలం చేసినం. మొదట వర్షాధారంగా సాగు చేద్దామని అనుకొని మొదలు పెట్టినం. వర్షాలు అనుకున్నంత పడక పంట చేతికచ్చేది కాదు. ఇలాగే ఉంటే కష్టమని అప్పు తెచ్చి బోరు వేయించినం. కరెంటు కోసం దరఖాస్తు చేసుకున్నం. దరఖాస్తు చేయడానికే నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినం. దరఖాస్తు చేసిన ఆరు నెలలకు కరెంటు లైన్ వచ్చింది. అప్పుడు సంతోష పడ్డాం. ఇక రెండు పంటలు పండుతాయనుకొని సంబుర పడ్డా.. మాకు చేదు అనుభవమే ఎదురయ్యింది. మొదటి ఏడాది వానకాలం పంట వేసినం. అప్పుడు అడపాదడపా వర్షాలు పడ్డాయి. వరి పొట్ట దశకు చేరుకొనే సమయానికి వానలు లేకుండా పోయినయ్. ఇక కరెంటే దిక్కే అనుకొని సాగు నీరు అందిద్దామని పొలం బోరుకాడికి పోతే కరెంటు వచ్చేది లేకపోయే. పొద్దంతా బోరుకాడ ఎదురు చూసి చూసి కండ్లు మూతలు పడేవి. సద్ది కట్టుకొని అక్కడే ఉండేవాళ్లం. రాత్రి ఎప్పుడో కరెంటు వచ్చేది. కరెంటు వచ్చినంక బోర్ వేస్తే రెండు మూడు గంటలు మాత్రమే పోసేది. ఆ వచ్చే నీరుతో ఒక్క మడి కూడా తడవక పోయేది. అలా రోజు రాత్రి పొలం కాడనే మంచే వేసుకుని ఉండేటోన్ని. వారం రోజులైన ఉన్న పొలం తడవక పోయేది. చివరి మడి వరకు నీరు వచ్చే సరికి పంట ఎండిపోయేది. ఒక్కొక్క సారి పాములు, తేళ్లు దాటుకుంటూ పోయేటోన్ని. అప్పుడున్న కాంగ్రెస్ గవర్నమెంట్ ఏనాడు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. పంటలు ఎండుతున్న కరెంటు ఇయ్యలేదు. ఒక్క పంట కోసం ఎన్నో ఇబ్బందులు పడినం. రాత్రి వేళ కరెంట్ కోసం లైట్లు పట్టుకుని పోయే లైన్ వెంట తిరిగినం. పగలు ఏనాడు కరెంటు ఇయ్యలేదు. పగలు కొంచేం రాత్రి కొంచెం ఇచ్చినా రైతులకు కొంత ఇబ్బంది ఉండేది కాదు. అప్పుడు ఎవరు పట్టించుకోలేదు. దాదాపు పదమూడేండ్లు కరెంటు కోసం నానావస్థలు పడ్డాం. రెండు పంటలు వేద్దామనుకున్న మాకు చేదు అనుభవమే ఎదురయ్యింది. తెలంగాణ వచ్చిన తర్వాత రైతులకు న్యాయం జరిగింది. ఇప్పుడు మాకు రెండు పంటలు ఫుల్లుగా పండుతున్నయ్. మొదట తొమ్మిది గంటలు రైతులకు ఉచితంగా ప్రభుత్వం నాణ్యమైన కరెంట్ ఇచ్చింది. ఆ తర్వాత 24 గంటలపాటు ఉచితంగా కరెంట్ ఇస్తుండడంతో మాకు ఢోకా లేకుండా పోయింది. ఒక్కసారీ మోటర్ స్టార్ట్ చేసి వస్తే సాయంత్రం వరకు పొలం కాడికి పోయేటోళ్లం కాదు. ఒక్క మడిలో నీళ్లు స్టార్ట్ చేస్తే చివరి మడి వరకు 24 గంటల కరెంటుతో నిండి పోతుంది. రెండు పంటలు అనుకున్నంత పండుతున్నయ్. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఐదెకరాలకు నీళ్లు రావని రెండు ఎకరాల సాగు చేస్తే సాగు నీరు అందడానికి వారం-పది రోజులు పట్టేది. ఇప్పుడు మాత్రం మాకున్న ఐదెకరాలకు రెండున్నర రోజులు పడుతుంది. అనుకోకుండా మెయిన్ లైన్‌లో ప్రధాన సబ్ స్టేషన్‌లలో లోపాలు వస్తే తప్పా కరెంటు పోవడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ అందించి న్యాయం చేస్తున్నరు. ఇలాంటి ప్రభుత్వం మరో సారి వస్తేనే రైతులకు ఏ గోస ఉండదు.

### రంది లేకుంట ఎవుసం చేస్తున్నం..



*కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : నాకు ఐదెకరాల భూమి ఉంది. తెలంగాణ రాకముందే ఒక్క వానకాలంలనే పంట వేసేటోన్ని. ఆ ఒక్క పంట తీయడానికి కూడా అరిగోస పడేటోళ్లం. కరెంటు ఉంటే.. నీళ్లు.. నీళ్లుంటే కరెంట్ ఉండకపోయేటిది. పంట చేతికచ్చేదాకా నమ్మకముండేటిది కాదు. కొందరైతే ఎవుసం ఇడిసిపెట్టి ఊర్లపొంటి పోయి బతికిన్రు. కానీ.. తెలంగాణ వచ్చినంక రంది లేకుంట ఎవుసం చేసుకుంటున్న. యేటా రెండు పంటలు తీస్తున్న. బోర్లు వేసుకుంటే పుష్కలంగా నీళ్లు పడ్డయి. 24 గంటల పాటు ఉచితంగా కరెంటు ఉంటంది. ఎప్పుడు కావాల్నంటే అప్పుడు.. నీళ్లు పెట్టుకుంటున్నం. ఎవుసం పండుగ లెక్క అయ్యిందంటే గది సీఎం కేసీఆర్ వల్లే.. ఎవ్వరినీ నమ్మినా మోసపోవుడే.. ఇన్నేండ్ల సంది లేంది.. ఇప్పుడచ్చి.. అది చేస్తాం.. ఇది చేస్తామంటే నమ్మల్నా.. మేమంతా కేసీఆర్ వెంటే ఉంటం.* **- జాటోత్ శంకర్, బర్రెపెల్లి, దహెగాం మండలం**

### తిప్పలన్నీ తప్పినయ్..



*కౌటాల, నవంబర్ 13 : మా ఊరిలో ఇంత ఎవుసం ఉంది. అప్పట్లో వానలు పడితేనే పంటలు పండేటివి. లేకుంటే వేసిన పంటలన్నీ ఎండిపోయేటివి. ఇంతకుముందున్న కాంగ్రెస్ పాలనలో కరెంటు సరిగా ఉండేటిది కాదు. ఇచ్చే కొద్దిపాటి కరెంటు కూడా ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. రాత్రి పూట పొలాల కాడ పండుకొని నీళ్లు పెట్టుకునేటోళ్లం. వరి పొట్టకచ్చినప్పుడే నీళ్లుండేటివి కావు.. పంట సక్కగా రాకపోతుండే. కానీ తెలంగాణ వచ్చి కేసీఆర్ సీఎం అయినంక 24 గంటల కరెంట్ ఉంటుంది. తిప్పలన్నీ తప్పినయి. మంచిగ ఎవుసం చేసుకుంటున్నం. మళ్లా కేసీఆరే గెలవాలి. మాలాంటి రైతులకు ఇంకా మంచి చేస్తడు.* **- రావుల దేవాజీ, రైతు, కౌటాల**

### సీఎం కేసీఆర్ వెంటే నడుస్తం..



*కౌటాల, నవంబర్ 13 :తెలంగాణ వచ్చినంక ఎవుసం మస్తు మంచిగైంది. సీఎం కేసీఆర్ రైతులకు దేవుని లెక్క అయ్యిండు. 24 గంటలు కరెంటు ఇస్తుండు. ఎప్పుడంటే అప్పుడు నీళ్లు పెట్టుకుంటున్నం. పెట్టుబడి కోసం ఎకరానికి రూ. 5 వేల చొప్పున రెండు పంటలకు రూ. 10 వేలు ఇస్తున్నడు. పంట పండినక సర్కారోళ్లే వడ్లు కొంటున్నరు. సావుకార్ల కంటే సర్కారోళ్లే ఎక్కువ పైసలు పెడుతున్నరు. రైతుకు ఏమైనా అయి సచ్చిపోతే రూ. 5 లక్షలచ్చి.. గాళ్ల కుటుంబాన్ని ఆదుకుంటున్నడు. సీఎం కేసీఆర్ అంటే నమ్మకం.. ఆయన వెంటే నడుస్తం.* **- చాప్లె బాబురావు, రైతు, మొగడ్‌ధగడ్**

### అడుగకున్నా అనేక పథకాలు తెచ్చిండు..



*కౌటాల, నవంబర్ 13 :తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతుల కోసం అనేక పథకాలు తీసుకొచ్చిండు. ఉచిత కరెంటు, రైతుబీమా, రైతుబంధులాంటి పథకాలను అందిస్తూ ఆదుకుంటున్నడు. మా నోటితో అడుగకున్నా.. గిన్ని పథకాలు తీసుకొచ్చి అమలు చేస్తుండు. ఎవుసాన్ని పండుగ లెక్క చేసిండు. పక్కన ఉన్న మహారాష్ట్ర రైతులు వచ్చి ఇక్కడ భూములు కొంటున్నరంటే కేసీఆర్ పాలన ఎంత బాగుందో అర్థం చేసుకోవచ్చు. మళ్లోసారి బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం.* **- ఆర్ ప్రకాశ్, రైతు, నదీమాబాద్**

# కోట్లాది నిధులతో నస్పూర్ పట్టణాభివృద్ధి

- మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- నస్పూర్‌లో ప్రజలతో సభ
- హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి



మాట్లాడుతున్న మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్, నవంబర్ 13 : నస్పూర్ మున్సిపాలిటీని కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశామని మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సీసీసీ కార్నర్ వద్ద మున్సిపాలిటీ పరిధిలోని 20, 21, 22 వార్డుల ప్రజలతో సభ నిర్వహించారు. కొత్తగా ఏర్పడిన నస్పూర్ మున్సిపాలిటీలోని వాడవాడలా రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, కొత్తగా విద్యుత్ స్తంభాలు, మంచినీటి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. రూ. 50 కోట్లతో తోళ్లవాగు నుంచి శ్రీరాంపూర్ వరకు నాలుగు వరుసల రోడ్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు ఓటు వేయాలని కోరారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రసాద్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో జిల్లాను ఏర్పాటు చేసుకున్నామని, నస్పూర్‌కు కలెక్టర్ కార్యాలయం వచ్చిందని, ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పార్టీ పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్, కౌన్సిలర్లు బేర సత్యనారాయణ, వంగ తిరుపతి, కుర్మిళ్ల అన్నపూర్ణ, బెడికె లక్ష్మి, బౌతు లక్ష్మి, కెడిక ప్రకాశ్‌రెడ్డి, పూదరి కుమార్, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, దీకొండ అన్నయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు వేల్పుల రాజేశ్, పానుగంటి సత్తయ్య, రౌతు రజిత, జ్యోతి, హైమద్, జక్కుల రాజేశం, జాడి భానుచందర్, గుమ్మడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452




**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

